

వైభవంగా మాసి మఖం వేడుకలు



● తిరుచెందూరు, కుంభకోణం క్షేత్రాల్లో నేత్రపర్వంగా రథోత్సవం

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, తంజావూరు జిల్లా కుంభకోణం చక్రపాణి ఆలయంలో బుధవారం మాసిమఖం రథోత్సవాలు కనులపండువగా జరిగాయి. తిరుచెందూరు ఆలయంలో 12 రోజులపాటు నిర్వహించే మాసి ఉత్సవాలు ఈ నెల 3న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులుగా స్వామి వారి వివిధ వాహన సేవలు చేశారు. ఈ ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన రథోత్సవం బుధవారం ఉదయం నిర్వహించారు. ముందుగా వినాయకుడి రథం బయలుదేరి ఎనిమిది ప్రధాన వీధుల్లో ఊరేగిన తర్వాత గమ్యస్థానం చేరింది. ఆ తర్వాత మహారథం ఊరేగింపు ప్రారంభమైంది. షణ్ముఖనాథుడు ఇష్టదేవేరులైన వళ్ళి, దైవానై సమేతుడై సర్వాలంకరణశోభితుడై రథంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై ఆశీనులయ్యారు. ఆ తర్వాత రథోత్సవాన్ని ఆలయ ట్రస్టీ ఇరా కన్నన్ ఆదిత్తన్ మోకుతాడును పట్టుకుని ప్రారంభించారు. ఎనిమిది ప్రధాన వీధుల్లో ఊరేగిన తర్వాత ఆ రథం మళ్ళీ రథమండప ప్రాంతానికి చేరింది. ఈ వేడుకలలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు, భక్తజన సంఘాలు సదుపాయాలను కల్పించారు. రథం ఊరేగిన ప్రధాన వీధులలో భక్తులకు మజ్జిగ, నారికేళ జలం, శీతలపానీయాలు, అల్పాహారాలను కూడా పంచిపెట్టారు. ఇక గురువారం మాసిమాస తెప్పోత్సవానికి ఆలయ అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు.



తిరుచెందూరు ప్రధాన రహదారిలో ఊరేగుతున్న రథం - వళ్ళి, దేవానై సమేతుడైన షణ్ముఖస్వామి (ఇన్‌సెట్లో)

చక్రపాణి ఆలయ రథోత్సవం...

తంజావూరు జిల్లా కుంభకోణంలోని సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం సుదర్శనవళ్ళి తాయార్, విజయవళ్ళితాయార్ సమేత చక్రపాణి ఆలయ రథోత్సవం కూడా బుధవారం ఉదయం ఘనంగా జరిగింది. ఈ ఆలయంలో మాసి మాస ఉత్సవాలు ఈ నెల 4న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ పెరుమాళ్, తాయార్ ప్రత్యేక అలంకరణలో వివిధ వాహనాలపై మాడవీధుల్లో ఊరేగారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం స్వామివారి రథోత్సవం ప్రారంభమైంది. సుదర్శనవళ్ళి, విజయవళ్లి తాయర్ సమేత చక్రపాణి పెరుమాళ్ స్వామి సర్వాలంకరణతో రథంలోని ప్రత్యేక పీఠంపై ఆశీనులయ్యారు. ఆ తర్వాత భక్తులు రథం మోకుతాళ్ళను పట్టుకుని 'చక్రరాజా.. చక్రరాజా' అంటూ నినాదాలు చేస్తూ లాగుతూ వెళ్ళారు.



కుంభకోణంలో చక్రపాణి ఆలయ రథోత్సవంలో భక్తులు

మహామఖం కొలనుకు పోటెత్తిన భక్తులు...

కుంభకోణంలోని 'మహా మఖం' తీర్థకొలనులో మాసిమఖం సందర్భంగా పుణ్యస్నానాలు చేసేందుకు బుధవారం ఉదయం వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. రాష్ట్రం నుండే కాకుండా కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి ఈ తీర్థకొలనులో మహామఖం వేడుకలు జరుగుతాయి. ఆ సందర్భంగా దేశంలోని పుణ్యనదులన్నీ సూక్ష్మ రూపంలో ఈ తీర్థకొలనులో చేరుతాయని, ఆ తీర్థకొలనులో స్నానమాచరిస్తే సర్వ పాపాలు పటాపంచలవుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఆ కొలనుకు 'మహామఖం తీర్థకొలను' అనే పేరొచ్చింది. అంతటి విశిష్టతలను సంతరించుకున్న ఈ తీర్థకొలనులో బుధవారం మహామఖం సందర్భంగా కుంభకోణం నగరంలోని పది శివాలయాలకు చెందిన పంచమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ స్వాములకు భక్తులు దీపారాధన, కర్పూర నీరాజనం సమర్పించిన తర్వాత కొలనులో దిగి తీర్థవారీ వేడుకల్లో పాల్గొన్నారు.



కుంభకోణం మహామఖం తీర్థకొలనులో వేకువజామునే స్నానాలు చేస్తున్న భక్తులు

పిల్లల్ని కనండి.. కానీ...

● కొత్త దంపతులకు ఉదయనిధి హితవు



నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పెళ్ళిచేసుకునే దంపతులు వెంటేనే పిల్లల్ని కనండి, కానీ ఎక్కువ మందిని కనొద్దని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పిలుపునిచ్చారు. ఏళ్లతరబడి కుటుంబ నియంత్రణ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, జనాభా నియంత్రణ చేసిన రాష్ట్రాన్ని అన్ని విధాలా శిక్షిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. డీఎంకే చెన్నై తూర్పు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం కలైవానర్ అరంగంలో దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు పర్యవేక్షణలో 72 జంటలకు సామూహిక వివాహాలు జరిగాయి. ఈ వేడుకలకు ఉదయనిధి హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి 72 రకాలైన సారెవస్తువులను కానుకగా అందించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సమక్షంలో ఈ వివాహం చేసుకున్న జంటల్లో మతాంతర వివాహాలు చేసుకున్నవారు, ప్రేమ వివాహాలు చేసుకున్నవారు అధికంగా ఉండటం తనకెంతో సంతోషం కలిగిస్తోందని చెప్పారు. తనది కూడా ప్రేమ వివాహమని, తన కుటుంబంలోనూ ప్రేమ వివాహాలు చేసుకున్నవారే అధికమని, తన తాత కరుణానిధి ప్రేమ వివాహాలను, ఆదర్శ వివాహాలను ఎక్కువగా ప్రోత్సహించేవారని చెప్పారు. మహిళాభ్యుదయం కోసం పాటుపడుతూ మహిళల ఆదరాభిమానాలను అధికంగా పొందుతుండటం చూసి ఓర్వలేకే కేంద్రంలోని బీజేపీ పాలకులు, రాష్ట్రంలో బీజేపీ నాయకులు పసలేని విమర్శలు చేస్తున్నారని ఉదయనిధి ఆరోపించారు. ప్రస్తుతం కేంద్రంలోని ప్రజావ్యతిరేక ప్రభుత్వం లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పేరుతో రాష్ట్రాన్ని దండించడానికి సిద్ధపడుతోందని, ఒక వేళ దేశవ్యాప్తంగా లోక్‌సభ సభ్యులను 800లకు పైగా పెంచినా జనాభా నిష్పత్తి ప్రకారం 22 లోక్‌సభ స్థానాలకు బదులుగా 10 స్థానాలనే పెంచాలని కుట్ర పన్నుతున్నారని, ఇలా నియోజకవర్గాల సంఖ్యను తగ్గించినా, పెంచినా రాష్ట్రమే నష్టపోవడం ఖాయమన్నారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకునే తాను నూతన వధూవరులను వెంటనే పిలల్ని కనమని చెబుతున్నానన్నారు. పుట్టబోయే బిడ్డలకు అందమైన తమిళంలో పేర్లు పెట్టాలని ఉదయనిధి విజ్ఞప్తి చేశారు.

ఆత్మగౌరవమే మా ప్రాణం...

హక్కులను హరిస్తే ఊరుకోం

● ఆ కాషాయ విద్యావిధానాన్ని అంగీకరించేది లేదు

● తిరువళ్లూరు సభలో సీఎం స్టాలిన్





తిరువళ్లూరు సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ విద్యావిధానం ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచేది కాదని, అది పూర్తిగా కాషాయ విద్యావిధానమని, అందుకే దానిని రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేసే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మరోమారు సుస్పష్టంగా ప్రకటించారు. రాష్ట్రంలో జాతీయ విద్యావిధానం పేరుతో త్రిభాషా విద్యావిధానాన్ని, నిర్బంధ హిందీ అమలు చేయడానికి, పునర్విభజన సాకుగా లోక్‌సభ స్థానాలను తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఖండిస్తూ రాష్ట్రమంతటా బుధవారం నిరసన సభలు జరిగాయి. తిరువళ్లూరు జిల్లా తిరుపాచ్చూరు కేపీఎస్ క్రికెట్ అకాడమీ మైదానంలో జరిగిన నిరసన సభలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయినుండే నిరుపేద విద్యార్థులను విద్యకు దూరం చేసే విధంగా, కులవృత్తులను ప్రోత్సహించేలా, దేశమంతటా హిందీ భాషకు పట్టం కట్టేలా ఉండటం వల్లే జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ కాషాయ విద్యావిధానాన్ని అమలు చేయకపోతే నిధులివ్వమంటూ కేంద్రంలోని బీజేపీ పాలకులు బెదరిస్తున్నారని, విద్యాశాఖ మంత్రి తమిళ ఎంపీలను, తమిళులను అనాగరికులంటూ విమర్శించి తన స్థాయిని దిగజార్చుకున్నారని, డీఎంకే ఎంపీల తీవ్ర నిరసనల కారణంగా అప్పటికప్పుడు ఆ మంత్రి తన మాటను ఉపసంహరించుకున్నారని చెప్పారు. తమిళులు ఎన్నో దశాబ్దాలుగా నాగరికులుగానే వ్యవహరిస్తున్నారని, వారికి ఆత్మగౌరవం ఎక్కువని, కేంద్రానికి ఎప్పుడూ బానిసలు వ్యవహరించరన్నారు. మదురై ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేసి ఏడేళ్లయినా ఓ ఇటుక కూడా వేయకుండా ఉండటమే నాగరికమా? రాష్ట్రంలో తుఫాను, వర్షబాధితులను ఆదుకోవటానికి రెండేళ్లుగా నిధులివ్వకపోవడం నాగరికమా? హిందీభాషను నిర్బంధం చేయకపోతే నిధులిచ్చే ప్రసక్తేలేదంటూ రాష్ట్రాన్ని బెదరించడం నాగరికమా? పదేళ్లుగా తమ అడుగులకు మడుగులొత్తని రాష్ట్రాలపై కక్షసాధింపు చర్యలు పాల్పడటమే నాగరికమా? అంటూ స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలను బెదిరించడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఉభయసభల్లో డీఎంకే సభ్యులు పాలకుల అవినీతి, అరాచకాలను ఎండగడుతుండటం చూసి భయపడటం వల్లే లోక్‌సభ స్థానాలను తగ్గించేందుకు కేంద్రంలోని బీజేపీ పాలకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని, ఆ ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయడానికే దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులతో ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయదలిచానని చెప్పారు. ఈ సభలో మంత్రి ఆవడి ఎస్ఎం నాజర్, డీఎంకే తిరువళ్లూరు తూర్పు జిల్లా శాఖ ఇన్‌చార్జి ఎంఎస్‌కే రమేష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సాయం రూ.2500కు పెంపు

● ఉచిత బియ్యంతో పాటు చక్కెర కూడా

● రూ.13600 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సీఎం రంగస్వామి

అడయార్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా దారిద్ర్య రేఖకు దిగువన ఉండే కుటుంబ మహిళా పెద్దకు ఇచ్చే ఆర్థిక సాయాన్ని రూ.2500కు పెంచడంతో పాటు, ప్రస్తుతం ఇస్తున్న ఉచిత బియ్యంతో పాటు రెండు కేజీల చక్కెరను, గోధుమలను కూడా ఉచితంగా ఇవ్వనున్నట్టు పుదుచ్చేరి సీఎం రంగస్వామి తెలిపారు. పుదుచ్చేరి రాష్ట్ర బడ్జెట్‌ను ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మొత్తం రూ.13,600 కోట్ల బడ్జెట్‌ను సభకు సమర్పించారు. పుదుచ్చేరి రాష్ట్ర 15వ శాసనసభ సమావేశాలు సోమవారం గవర్నర్ కైలాసనాథన్ ప్రసంగంతో ప్రారంభమైన విషయం తెల్సిందే. ఈ సమావేశాలో మూడో రోజైన బుధవారం ఆర్థిక మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రంగస్వామి 2025-26 సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

ఈ బడ్జెట్‌లోని ముఖ్యాంశాలు... : రాష్ట్రంలో ఉచిత బియ్యం పంపిణీ పథకాన్ని కొనసాగించేందుకు రూ.300 కోట్లను కేటాయించారు. వచ్చే నెల నుంచి రాష్ట్రంలోని అన్ని కుటుంబ రేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు చక్కెర, గోధుమలను కూడా ఉచితం అందిస్తామని ప్రకటించారు. వారంలో రెండు రోజులు మాత్రమేకాకుండా, ఇకపై ప్రతిరోజూ సాయంత్రం విద్యార్థులకు స్నాక్స్ అందిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి 12వ తరగతి వరకు చదివే చేసే విద్యార్థులకు ప్రతి నెలా రూ.వెయ్యి చొప్పున వచ్చే మూడేళ్ళపాటు అందజేస్తామన్నారు. అసంఘటిత కార్మికులకు నెలకు రూ.2 వేలు ఆర్థిక సాయం చేస్తామన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి నిధికి కేటాయించే మొత్తాన్ని రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లకు పెంచారు. ఈసీఆర్ రోడ్డులో నిర్మించిన మఫ్షల్ బస్టాండుకు మాజీ ప్రధాని దివంగత వాజ్‌పేయి పేరు. దివ్యాంగులకు ఇచ్చే అంత్యక్రియల ఆర్థిక సహాయాన్ని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచారు. ముఖ్యమంత్రి రంగస్వామి తన బడ్జెట్ ప్రసంగాన్ని గంటా పది నిమిషాల్లో పూర్తి చేయగా, సభ్యులంతా తమ హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు.



బడ్జెట్ ప్రవేశపెడుతున్న సీఎం రంగస్వామి

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : 6.26

సహర్ (శుక్రవారం) : 4.37

చెన్నైలో తన నివాసం వద్ద బుధవారం ఉదయం జరిగిన డీఎంకే చెన్నై సౌత్‌జిల్లా శాఖ ప్రిసీడియం చైర్మన్ గుణశేఖరన్ కుమార్తె కె.అనసూయ వివాహవేడుకల్లో సతీమణి దుర్గాస్టాలిన్‌తో పాటు పాల్గొని, వరుడు దినేష్‌బాబుకు మంగళసూత్రాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



సమాచార దర్శిని

థాడ్కో ఆధ్వర్యంలో 'స్పోకెన్ ఇంగ్లీషు'

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తికి సంబంధించిన స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణకు 'థాడ్కో' దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తమిళనాడు ఆదిద్రావిడ హౌసింగ్ డెవలప్‌మెంట్ బోర్డు (థాడ్కో) వివిధ రకాల నైపుణ్య శిక్షణ ఇస్తోంది. ఈ నేపథ్యంలో, వైద్య వృత్తికి సంబంధించిన స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణకు ఆదిద్రావిడులు, గిరిజన విద్యార్థులు పాల్గొనవచ్చు. బీఎస్సీ, ఎమ్మెస్సీ, నర్సింగ్, తదితర కోర్సులు పూర్తిచేసిన 21-35 ఏళ్లలోపున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణ పూర్తిచేసిన వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఆసక్తి కలిగిన వారు www.tahdco.com అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలియజేసింది.

తమిళ లిటరేచర్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తమిళ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏడాది తమిళ లిటరేచర్ కోర్సుల అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు www.ulakaththamizh.in అనే వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 7వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీస విద్యార్హత 10వతరగతి ఉత్తీర్ణతకాగా, ఫీజు రూ.3,200 చెల్లించాలి. ఈ కోర్సుల ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 11వ తేది నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు 044-2254 2992, 9600021709 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

నేడు తిరువణ్ణామలైలో గిరి ప్రదక్షిణ

టి.నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవ క్షేత్రం తిరువణ్ణామలైలో మాసి మాస పౌర్ణమి సందర్భంగా గురువారం రాత్రి గిరి ప్రదక్షిణ చేయాలని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. మాసి మాస పౌర్ణమి గురువారం ఉదయం 11.40 గంటల ప్రారంభమై శుక్రవారం మధ్యాహ్నం 12.57కు ముగుస్తుందని, కనుక గురువారం రాత్రి భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తే సకల సౌభాగ్యాలు ప్రాప్తిస్తాయని అరుణాచలేశ్వర ఆలయ నిర్వాహకలు ప్రకటించారు.

18న అఖిలపక్ష సమావేశం: ఈసీ

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 18న అఖిలపక్ష పార్టీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల ప్రక్రియ బలోపేతం చేసేందుకు రాజకీయ పార్టీలతో సమావేశాలు ఏర్పాటుచేసి అభిప్రాయాలు సేకరించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, ఈ నెల 18న నగరంలో అంగీకారం పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలతో సమావేశం కానున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ప్రకటన విడుదల చేశారు.

కచ్చాదీవి ఆంథోనియర్ ఉత్సవాలు
ఐదు రోజులు చేపలవేట నిషేధం

టి.నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కచ్చాదీవి ఆంథోనియర్ ఆలయ ఉత్సవాలు ఈ నెల 14 నుంచి 15 వరకు జరుగనుండటంతో ఐదు రోజులపాటు ఆ దీవి సమీప ప్రాంతాల్లో చేపలవేటపై నిషేధం విధిస్తున్నట్లు మత్స్య శాఖ అధికారులు తెలిపారు. ఈ నిషేధం మంగళవారం నుండి అమలులో ఉంటుందన్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనే నిమిత్తం రామేశ్వరం పరిసర ప్రాంతాలకు చెందిన 3 వేల మంది జాలర్లు 90 మరపడవలు, 22 నాటు పడవలలో వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

తాంబరం పరిధిలో నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెస్ట్ తాంబరం ముల్లైనగర్ సమీపంలోని పుదుతాంగళ్ సబ్ స్టేషన్‌లో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. ఈ ప్రాంగణం మొదటి అంతస్తులోని తాంబరం నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం 11 నుంచి జరిగే ఈ గ్రీవెన్స్‌లో, తాంబరం పరిధిలోని వినియోగదారులు సమస్యలకు పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

22న గ్రామసభలు

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 22న గ్రామసభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 22న ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నిర్వహించే గ్రామసభల్లో స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై చర్చించాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే, గ్రామసభ నిర్వహించే ప్రాంతం, సమయం తదితరాలు ప్రచారం చేసి, ప్రజలందరూ ఈ గ్రామ సభల్లో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు అందించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

పౌర్ణమి, వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి, వారాంతపు సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం 966 బస్సులు నడుపనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) విడుదల చేసిన ప్రకటనలో... కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ ప్రాంతాలకు ఈ నెల 14వ తేది (శుక్రవారం) 270 బస్సులు, 15న (శనివారం) 275 బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు 14,15 తేదీల్లో తలా 51 బస్సులు, మాధవరం బస్ టెర్మినల్ నుంచి 14,15 తేదీల్లో తలా 20 బస్సులు నడుపనున్నారు. ఇక, ఎస్‌ఈటీసీ బస్సుల్లో శుక్రవారం 4,896 మంది, శనివారం 2,381 మంది, ఆదివారం 6.020 మంది రిజర్వేషన్ చేయించుకున్నారని అధికారులు తెలిపారు.

తిరుపతి-కాట్పాడి-జోలార్‌పేట మెము రైళ్ల రద్దు

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి కాట్పాడి, జోలార్‌పేటకు వెళ్లే మెము రైళ్ల రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, తిరుపతి నుంచి సాయంత్రం 6.10 గంటలకు కాట్పాడి బయల్దేరే మెము గురువారం నుంచి ఈ నెల 15వ తేది వరకు రద్దు. అలాగే, కాట్పాడి నుంచి ఉదయం 6.10, సాయంత్రం 5.15 గంటలకు తిరుపతి బయల్దేరే మెము, తిరుపతి నుంచి ఉదయం 10.35 గంటలకు కాట్పాడి బయల్దేరే మెము రైళ్లు గురువారం నుంచి ఈ నెల 16వ తేది వరకు రద్దు. అదేవిధంగా తిరుపతి నుంచి ఉదయం 7.35 గంటలకు కాట్పాడికి బయల్దేరేది, కాట్పాడి నుంచి రాత్రి 9.10 గంటలకు తిరుపతికి, కాట్పాడి నుంచి ఉదయం 10.30 గంటలకు జోలార్‌పేటకు, అక్కడి నుంచి మధ్యాహ్నం 12.55 గంటలకు కాట్పాడి బయల్దేరే మెము రైళ్లు గురువారం నుంచి ఈ నెల 17వ తేది వరకు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.





ధర్నా చేస్తున్న ఆందోళనకారులు - ఆందోళనకారులు ధ్వంసం చేసిన టోల్‌గేట్ క్యాబిన్లు

దిండుగల్ టోల్‌గేట్ ధ్వంసం

ప్యారీస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): దిండుగల్‌లో బుధవారం ఉదయం ప్రారంభించాల్సిన టోల్‌గేట్‌ను స్థానికులు ధ్వంసం చేసిన సంఘటన కలకలంరేపింది. దిండుగల్ పరిధిలోని వత్తలగుండు సమీపంలోవున్న లక్ష్మీపురంలో టోల్‌గేట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నాలుగు రహదారుల పనులు పూర్తయ్యాక ఈ టోల్‌గేట్ ప్రారంభించనున్నట్లు అధికార పూర్వకంగా ప్రకటించారు. అయితే రెండు రోడ్ల పనులు పూర్తయిన నేపథ్యంలో ఈ టోల్‌గేట్ బుధవారం ఉదయం 10గంటల నుండి పనిచేస్తుందని ప్రకటించారు. దీనికి సంబంధించి వాహనాలకు పన్ను వసూళు చేసేందుకు కౌంటర్లు కూడా ఏర్పాటు చేసి, సిబ్బందిని కూడా నియమించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ఆ టోల్‌గేట్‌ను ముట్టడించి, అక్కడున్న కౌంటర్లు, సామగ్రిని ధ్వంసం చేయడంతో పాటు సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. దీంతో ఆ ప్రాంతంలో దాదాపు రెండు గంటల పాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం తెలిసి సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదుచేసి విచారణ ప్రారంభించారు.

రవాణా సంస్థలకు 19 అవార్డులు

- మంత్రి శివశంకర్ అభినందన

ప్యారీస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తున్న ప్రభుత్వ రవాణా సంస్థలు 19 అవార్డులు సొంతం చేసుకోవడంపై ఆ శాఖామంత్రి శివశంకర్ హర్షం వ్యక్తంచేశారు. ఢిల్లీలో ఈ నెల 7వ తేదీ అన్ని రాష్ట్రాల ప్రభుత్వ రవాణా సంస్థల ఉత్తమ సేవలను గుర్తిస్తూ 2023-24వ సంవత్సర అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ గవర్నర్ కిరణ్ బేదీ చేతుల మీదుగా రాష్ట్రప్రభుత్వ రవాణా శాఖ ఉన్నతాధికారులు 19 అవార్డులు అందుకున్నారు. దీనిపై స్పందించిన మంత్రి శివశంకర్ రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలను అంకితభావంతో అందిస్తున్నందువల్లే ప్రభుత్వ రవాణా సంస్థలకు ఘనత చేకూరేలా 19 అవార్డులు దక్కాయని సంతోషం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి ఈ అవార్డులు రావడానికి కారణమైన బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, టెక్నికల్ సిబ్బంది, అధికారులకు అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారని మంత్రి తన ప్రకటనలో తెలిపారు.

డీఎంఎల్‌టీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక తండయార్‌పేటలోని అంటువ్యాధుల ఆస్పత్రిలో మెడికల్ లాబొరేటరీ టెక్నీషియన్ (డీఎంఎల్‌టీ) డిప్లొమో కోర్సులో ప్రవేశానికి ఈ నెల 21వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈమేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) విడుదల చేసిన ప్రకటనలో... 2024-25 విద్యా సంవత్సరానికి డీఎంఎల్‌టీ కోర్సులో కార్పొరేషన్ ఉద్యోగుల పిల్లలు, కార్పొరేషన్ పాఠశాలల్లో చదివిన వారు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో. ప్లస్ టూ సైన్స్ పాఠ్యాంశంలో ఉత్తీర్ణులైన వారు అర్హులు, రెండేళ్ల ఈ కోర్సు ఆంగ్లం మాధ్యమంలో ఉంటుందని, నెలవారీ ఫీజు రూ.700 చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు ఆస్పత్రి ప్రాంగణంలోని కార్యాలయాన్ని ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు (పని దినాల్లో) సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని జీసీసీ తెలిపింది.

స్మార్ట్ మీటర్ల కొనుగోలుకు టెండర్లు

ప్యారీస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇళ్లతో పాటు అన్నిరకాల విద్యుత్ కనెక్షన్లలో మీటర్ రీడింగ్‌లో అవకతవకలు లేకుండా రాష్ట్రప్రభుత్వం 3కోట్ల స్మార్ట్ మీటర్ల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించింది. 2026వ సంవత్సరంలోగా స్మార్ట్ మీటర్ల పథకాన్ని పూర్తిస్థాయిలో నెరవేర్చాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం గడువు నిర్ణయించింది. ఈ పథకం కోసం గతంలో ఆహ్వానించిన టెండర్లను రాష్ట్రప్రభుత్వం రద్దుచేసింది. ప్రస్తుతం ఆరు దశలుగా విద్యుత్ కనెక్షన్లతో స్మార్ట్ మీటర్లను పొందుపరచనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం ఈ పనుల కోసం టెండర్లు ఆహ్వానించింది.

'మలైదళం' కొత్త వెబ్‌సైట్

చెన్నై,మార్చి12(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని కొండ ప్రాంతాల్లోని ప్రైవేటు భూముల్లో చెట్లు నరకడం, తీసుకెళ్లడం తదితరాల అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేలా 'మలైదళం' అనే వెబ్‌సైట్‌ను అటవీ శాఖ ప్రారంభించింది. ఆ ప్రకారం, జిల్లా అటవీ శాఖ అధికారికి సమర్పించిన దరఖాస్తులను, జిల్లాస్థాయి అధికారుల కమిటీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటుందని అటవీ శాఖ తెలిపింది.

● ఎస్సీ విద్యార్థిపై దాడి కేసు..
ప్రభుత్వానికి ఎస్సీ,ఎస్టీ కమిషన్ నోటీసు

టి.నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంఠం సమీపంలో పరీక్ష రాయడానికి వెళ్తున్న అరియనాయకపురానికి చెందిన దేవేంద్రరాజ్ అనే ప్లస్-1 ఎస్సీ విద్యార్థిపై కుల వివక్షత నేపథ్యంలో జరిగిన దాడి సంఘటనపై సమగ్రమైన నివేదిక సమర్పించమంటూ ఆ జిల్లా కలెక్టర్, ప్రభుత్వానికి రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ ఆదేశించింది. మూడు రోజుల క్రితం పాళయంకోట ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో ప్లస్-1 పబ్లిక్ పరీక్ష రాయడానికి ఆ విద్యార్థి బస్సులో వెళ్తుండగా గెట్టియమ్మాళ్‌పురం వద్ద ఆ బస్సును ఇద్దరు యువకులు ఆపి బస్సెక్కి అతడిని బయటకు లాగి వేటకొడవళ్లతో దాడి చేసి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన దేవేంద్రరాజ్ ప్రస్తుతం పాళయంకోట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ సంఘటనపై పత్రికలలో వచ్చిన వార్తలను ఆధారంగా చేసుకుని ఆది ద్రావిడ గిరిజనుల కమిషనర్ ఛైర్మన్ జస్టిస్ తమిళ్‌వానన్, సభ్యులు ఆనందరాజా, ఇళంజెళియన్ స్యూమోటో కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.



దాడికి గురైన విద్యార్థి దేవేంద్రరాజ్

షెడ్యూలు కులానికి చెందిన దేవేంద్రరాజ్‌ను కులవివక్షత నేపథ్యంలో అగ్రవర్గాలకు చెందిన ఇద్దరు బాలురు వేటకొడవళ్లతో దాడి చేయించారని తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు. ఈ సంఘటనపై తూత్తుకుడి జిల్లా కలెక్టర్. డీఎస్పీ విచారణకు సంబంధించిన వివరాలతో సమగ్రమైన నివేదికను ఏప్రిల్ 2 లోగా సమర్పించాలని ఉత్తర్వు జారీ చేశారు.

టాస్మాక్‌లో రూ.1,000 కోట్ల అవినీతి

- అన్నామలై ఆరోపణ



ప్యారీస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని టాస్మాక్ సంస్థలో రూ.1,000 కోట్ల అక్రమ నగదు బట్వాడ జరిగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆరోపించారు. తూత్తుకుడిలో బుధవారం అన్నామలై మీడియాతో మాట్లాడుతూ... టాస్మాక్ చిల్లర దుకాణాలకు సరఫరా చేసే మద్యం రకాల్లో నాణ్యతలేదని, ఆశాఖలో అవినీతి రాజ్యమేలుతోందనే సమాచారంతో ఈడీ అధికారులు చేసిన తనిఖీలో రూ.1,000 కోట్ల అవినీతి జరిగినట్లు సమాచారం అందిందని తెలిపారు. ఈ నగదు అధికార పార్టీకే చేరివుంటుందని ఆయన ఆరోపించారు. పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ఇటీవల ఓ ప్రకటన విడుదల చేశారని, అందులో టాస్మాక్‌లో చేపట్టిన తనిఖీల్లో రూ.1,000 కోట్ల స్థాయికి అవినీతి జరిగిందని తీవ్ర ఆరోపణలు చేసినా. రాష్ట్రప్రభుత్వం కానీ, డీఎంకే మంత్రులు కానీ ఖండించలేదన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు డీఎంకే పథకం రూపొందించిందని, అందువల్లే ఎన్నికల ఖర్చుకోసం ఇలాంటి అవినీతి సొమ్మును కూడబెట్టుకుంటోందని విమర్శించారు. డీఎంకే ఎంపీల్లో ఎక్కువమంది హిందీ బాగా తెలిసినవారేనని, అయితే పార్లమెంటులో తెలియనట్లు నాటకమాడుతున్నారని తెలిపారు. త్రిభాషా విద్యావిధానంపై రాష్ట్రప్రజలను డీఎంకే ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సుమారు 4,479 మెట్రిక్లేషన్ పాఠశాలలు పనిచేస్తున్నాయని, ఈ పాఠశాలల్లో విద్యార్థులకు త్రిభాషలు బోధిస్తున్నారని తెలిపారు. ఇక సీబీఎస్సీ పాఠశాలల్లో 16 లక్షల మంది హిందీ మీడియం చదువుతున్నారని, రాష్ట్రంలో మరో 15 లక్షల మంది విద్యార్థులు హిందీ మీడియంలో చదువుతున్నట్లు రాష్ట్రప్రభుత్వమే అధికారపూర్వకంగా ప్రకటించిందన్నారు. 2018-19వ విద్యా సంవత్సరంలో 67.85 లక్షల మంది విద్యార్థులు తమిళ మీడియంలో చదువుకున్న నేపథ్యంలో, ప్రస్తుతం ఈ సంఖ్య 19.05 లక్షలకు తగ్గిందని ఇందుకు కారణం డీఎంకేలో ఉన్న పలువురు ప్రముఖులేనని అన్నామలై విమర్శించారు.

నాగపట్టిణం జిల్లాలో భారీవర్షాలు

- వేదారణ్యంలో ఉప్పు ఉత్పత్తికి అంతరాయం

ప్యారీస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నాగపట్టిణం జిల్లాలో సోమవారం నుండి కురుస్తున్న భారీవర్షాలకు జనజీవనం స్థంబించింది. జిల్లాలో ఉప్పు ఉత్పత్తికి ప్రసిద్ధిచెందిన వేదారణ్యంలో ఉప్పుమళ్లలో వర్షపు నీరు చేరడంతో ఉత్పత్తికి అంతరాయం కలిగింది. అదేవిధంగా జిల్లాలోని అగస్త్యన్‌పల్లి, కోడియకాడు, కనడిల్‌వైల్ సహా 30కి పైగా ప్రాంతాల్లో ఉప్పు ఉత్పత్తి గత రెండ్రోజులుగా నిలిచిపోవడంతో దీనిపై ఆధారపడిన వందలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. అదేవిధంగా వర్షం ప్రభావానికి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయ భూముల్లో వర్షపు నీరుచేరడంతో నష్టపోయామని అక్కడి అన్నదాతలు వాపోతున్నారు.

మద్యం మత్తులో ఏనుగుపై నిద్రపోయిన మావటిపై కేసు

టి.నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా తిరుపరప్పు సమీపం అండకోడు ప్రాంతం వద్ద మేతకు తీసుకెళ్ళిన ఏనుగుపై మావటి మద్యం తాగి నిద్రపోవటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పాడింది. పోలీసులు, అటవీశాఖ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మావటిని నిద్రనుండి లేపడానికి నానా తంటాలు పడ్డారు. తిరుపరప్పు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అటవీశాఖ అనుమతితో 'అనుపమ' అనే ఏనుగును పెంచుతున్నాడు. ఆ ఏనుగును మావటి అండకోడు ప్రాంతంలో మేతకు తీసుకెళ్ళి సాయంత్రం ఇంటికి తిరిగి తీసుకువచ్చేవాడు. ఆ ప్రకారమే మంగళవారం సాయంత్రం ఆ ఏనుగును ఇంటికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మావటి పీకల దాకా మద్యం తాగాడు. కాసేపయ్యాక ఏనుగు పైనే పడుకుని నిద్రపోయాడు. మావటి చేతిలో నుండి రోడ్డుపై జారి పడిన అంకుశాన్ని ఆ ఏనుగు తొండంతో తీసి ఇచ్చినా పట్టుకోలేదు. దీంతో మావటికి ఏదో కీడు జరిగి ఉంటుందని ఏనుగు భయపడి రోడ్డు పక్కగా కదలకుండా నిలిచింది. చాలా సేపటి వరకూ ఏనుగు కదలకపోవటం, మావటి ఏనుగుపైనే నిదురపోతుండటం చూసిన స్థానికులు వెంటనే పోలీసులు, అటవీశాఖ అధికారులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు, అటవీ శాఖ అధికారులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి ఏనుగుపై నిదురపోతున్న మావటి లేపేందుకు నానా తంటాలు పడ్డారు. అరగంట తర్వాత మావటి లేచి తన చుట్టూ పోలీసులు, అటవీ శాఖ అధికారులుండటం చూసి ఆశ్చర్యపోయాడు. అదే సమయంలో ఏనుగును లారీలో ఎక్కించేందుకు ప్రయత్నించారు. ఆ ఏనుగు కదలక అక్కడే నిలిచింది. చివరకు మావటి రోడ్డుపై నడచి దారి చూపుతుండగా ఆ ఏనుగు అతడిని అనుసరిస్తూ యజమాని ఇంటికి చేరుకుంది. ఆ తర్వాత మావటిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన కారణంగా ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు గంటకుపైగా అంతరాయం కలిగింది. ప్రస్తుతం ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో ప్రసారమైన ఎక్కువగా వైరల్ అవుతోంది.



ఏనుగుపై నిద్రపోతున్న మావటి

గుమ్మిడిపూండి మార్గంలో 27 సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొన్నేరి-కవరైపేట రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలు మార్పిడి కారణంగా గురు, ఈ నెల 15,27 తేదీల్లో గుమ్మిడిపూండి మార్గంలో వెళ్లే సబర్బన్ రైళ్ల సేవలు పాక్షికంగా రద్దు చేశారు.

- సెంట్రల్-గుమ్మిడిపూండి మధ్య ఉదయం 8.05, 9, 9.30, 10.30, 11.35, సెంట్రల్-సూళ్లూరుపేట మధ్య ఉదయం 8.35, 10.15, మధ్యాహ్నం 12.10, 1.05 సబర్బన్ రైళ్లు రద్దు
- చెన్నై బీచ్-గుమ్మిడిపూండి మధ్య ఉదయం 9.40, మధ్యాహ్నం 12.40, సూళ్లూరుపేట-నెల్లూరు మధ్య మధ్యాహ్నం 3.30, సెంట్రల్-ఆవడి మధ్య రాత్రి 11.40 సబర్బన్ రైళ్లు రద్దు
- గుమ్మిడిపూండి-సెంట్రల్ మధ్య ఉదయం 9.55, 11.25, మధ్యాహ్నం 12 గంటల సబర్బన్ రైళ్లు రద్దు
- గుమ్మిడిపూండి-చెన్నై బీచ్ మధ్య ఉదయం 10.55, నెల్లూరు-సూళ్లూరుపేట సాయంత్రం 6.45 గంటల సబర్బన్ రైళ్లు రద్దు
- సూళ్లూరుపేట-సెంట్రల్ మధ్య ఉదయం 11.45, మధ్యాహ్నం 1, 2.30, 3.15, రాత్రి 9 గంటల సబర్బన్ రైళ్లు రద్దు

పాక్షిక రద్దు...

- చెంగల్పట్టు-గుమ్మిడిపూండి మధ్య ఉదయం 9.55 గంటలకు బయల్దేరే సబర్బన్ రైలు చెన్నై బీచ్ వరకు మాత్రమే నడుపనున్నారు.
- గుమ్మిడిపూండి-తాంబరం మధ్య మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరే సబర్బన్ రైలు చెన్నై బీచ్ నుంచి బయల్దేరుతుంది.

ప్రత్యేక రైళ్లు....

- సెంట్రల్-పొన్నేరి మధ్య ఉదయం 9, 10.30, 11.35, మధ్యాహ్నం 12.40, ఎన్నూర్ నుంచి ఉదయం 9.30 గంటలకు ప్రత్యేక సబర్బన్ రైళ్లు
- పొన్నేరి-సెంట్రల్‌కు ఉదయం 11.42, మధ్యాహ్నం 1.18, 3.33, ఎన్నూర్-సెంట్రల్‌కు మధ్యాహ్నం 12.43, మీంజూరు-సెంట్రల్‌కు మధ్యాహ్నం 2.59 గంటలకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు ఎస్కేడీటీ పాఠశాల వార్షికోత్సవం

ప్యారీస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కంలోని కనక దుర్గ తెలుగు ప్రాథమిక పాఠశాల (ఎస్కేడీటీ) 78వ వార్షికోత్సవం, క్రీడా దినోత్సవం శుక్రవారం సాయంత్రం జరుగనుంది. ఎస్కేడీటీ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ పాఠశాలల ఛైర్మెన్, ఏఐటీఎఫ్ అధ్యక్షులు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి అధ్యక్షతన జరగనున్న కార్యక్రమానికి మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతి డాక్టర్ విస్తాలి శంకర్‌రావు ముఖ్యఅతిథిగా, పారిశ్రామికవేత్త శోభారాజా, పాఠశాలల ఉపాధ్యక్షులు డాక్టర్ సీఎం కిషోర్ తదితరులు హాజరవుతారని, లయన్ జె.జనకకోటయ్య విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రేణుకా, కరస్పాండెంట్ వీవీహెచ్ కామేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

ఫుట్ పాత్ దుకాణాల తొలగింపు



కేసరి పాఠశాల సమీపంలో ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో పాఠశాలలు, బస్‌షెల్టర్ల సమీపంలోని ఫుట్ పాత్ ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలను కార్పొరేషన్ సిబ్బంది తొలగిస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఫుట్ పాత్‌లు ఆక్రమణలకు గురికావడంతో ట్రాఫిక్ సమస్య కారణంగా ఫుట్‌పాత్‌లపై వెళ్లే విద్యార్థులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో పాఠశాలలు, బస్‌షెల్టర్ల వద్ద ఫుట్‌పాత్‌లు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేసినట్లు పలువురు కార్పొరేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై దృష్టి సారించిన కార్పొరేషన్ అధికారులు, నగరంలో 66 పాఠశాల సమీపంలోని ఫుట్‌పాత్ ఆక్రమించి ఏర్పాటుచేసిన 168 దుకాణాలను తొలగించారు. మరోసారి దుకాణాలు ఏర్పాటుచేస్తే చర్యలు చేపడతామని ఆక్రమణదారులను అధికారులు హెచ్చరించారు.

యాంటీ వీరప్పన్ టాస్క్‌ఫోర్స్ బాధితులకు మూడు వారాల్లో పరిహారం

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వీరప్పన్‌ను వెతికేందుకు పాల్గొన్న టాస్క్‌ఫోర్స్ వలన నష్టపోయిన బాధితులకు మూడు వారాల్లో పరిహారం చెల్లించాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను బంధించేందుకు యత్నించిన టాస్క్‌ఫోర్స్ కారణంగా పలు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ విషయమై జాతీయ మానవ హక్కుల సంఘం ఉత్తర్వులతో, బాధితులకు రూ.5 కోట్లు అందజేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. ఈ క్రమంలో, బాధితులకు రూ.1,20,50,000 పరిహారం అందజేసిన నేపథ్యంలో, రూ.3.80 కోట్లు చెల్లించడంలో జాప్యం జరిగింది. ఈ విషయమై దాఖలైన ఫిర్యాదును విచారించిన మానవ హక్కుల కమిషన్, బాధితులకు బకాయి పరిహారం అందించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. బుధవారం ఈ పిటిషన్ విచారణకు రాగా, పరిహారం చెల్లింపునకు మూడు వారాలు గడువు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను మద్రాసు హైకోర్టు అంగీకరిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

ప్రభుత్వ పాఠశాలల్లో 42వేల ప్రవేశాలు

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమైన 12 రోజుల్లో 42వేల మంది చేరినట్లు సమాచారం. రాష్ట్రంలోని 37,553 పాఠశాలల్లో సుమారు 52 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచేలా మార్చి 1 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభించింది. అడ్మిషన్లు ప్రారంభమైన 12 రోజుల్లో 41,931 మంది విద్యార్థులు పాఠశాలల్లో చేరారు. ఐదేళ్లకు పైబడిన పిల్లలను గుర్తించి, వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు, ఈ విద్యా సంవత్సరం 5 లక్షల మంది విద్యార్థులు చేర్చాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

జనావాసాల్లోకి దుప్పి

- నాగర్‌కోవిల్‌లో స్థానికులకు అవస్థలు



అడవి దుప్పిని బంధించేందుకు ప్రయత్నిస్తున్న అటవీ సిబ్బంది

చెన్నై, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోవిల్ సమీపం పళ్లివిలై ప్రాంతంలో బుధవారం ఉదయం అడవి నుండి వచ్చిన దుప్పి స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. ఆ ప్రాంతంలో డైరీ వీధిలో సుమారు వందకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఉదయం ఏడు గంటల ప్రాంతంలో వచ్చిన అడవి దుప్పి రోడ్ల వెంట పరుగులు తీసింది. అడ్డుగా వచ్చినవారిని కుమ్మిపడేసింది. దీంతో స్థానికులు ఆ దుప్పిని అక్కడి నుండి తరిమేందుకు నానా తంటాలు పడ్డారు. ఆ లోపున అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు తనను చుట్టుముట్టడంతో భయపడిన ఆ దుప్పి పక్కనే ఉన్న ఓ ఇంటి మెట్లపై నిలిచింది. అది చూసి మిద్దెపై ఉన్న కుటుంబం తలుపులు గడియపెట్టుకుంది. ఆ తర్వాత అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని ఆ అడవి దుప్పిని వలలో బంధించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. సుమారు అరగంట వరకు అందరినీ ముప్పుతిప్పలు పెట్టిన ఆ అడవి దుప్పిని అటవీ శాఖ అధికారులు పెద్ద వలలు వేసి నిర్బంధించారు. ఆ తర్వాత వ్యాన్‌లో ఎక్కించి పక్కనే ఉన్న అడవిలో విడిచిపెట్టారు.

మెరీనా సమీపంలో కారు ఢీకొని చిరువ్యాపారి మృతి

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా తీరంలో కారు ఢీకొన్న ఘటనలో ఐస్‌క్రీం వ్యాపారి మృతిచెందాడు. ఆంధ్ర రాష్ట్రానికి చెందిన రమేష్ (50) అయనావరంలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటూ మెరీనా బీచ్‌లో ఐస్‌క్రీం విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో, సోమవారం రాత్రి రమేష్ మెరీనా లైట్ హౌస్ ఎదురుగా ఉన్న కామరాజర్ రోడ్డు దాటుతున్న సమయంలో వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన రమేష్‌ను చుట్టుపక్కల వారు రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వ్యవహారంపై అన్నాస్క్వేయర్ పోలీసులు కేసు నమోదుచేసి, ప్రమాదానికి కారణమైన తెన్‌కాశి జిల్లా అలంగుళం ప్రాంతానికి చెందిన శివానందంను అదుపులోకి తీసుకున్నారు.

విద్యార్థినిపై వేధింపులకు పాల్పడిన టీచర్ అరెస్ట్

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రెండవ తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన టీచర్ పోక్సో చట్టం కింద కటకటాలపాలయ్యాడు. సేలం జిల్లాలోని ఓ గ్రామ పాఠశాలలో నాగర్‌కోయిల్‌కు చెందిన వ్యక్తి (50) ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆయన పనిచేసే పాఠశాలలో 2వ తరగతి చదువుకుంటున్న 7 ఏళ్ల బాలికపై అతడు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఆ బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన విద్యా శాఖ, పిల్లల సంక్షేమ శాఖ అధికారుల ఫిర్యాదుతోపోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి ఆ ఉపాధ్యాయుడిని అరెస్ట్ చేసారు.

మాదక ద్రవ్యాలతో ముగ్గురు మెడికోల అరెస్ట్

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ ప్రాంతంలో శిక్షణ పొందుతున్న వైద్య విద్యార్థుల గదుల్లో గంజాయి ఉన్నట్లు రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డీన్ తేరనిరాజన్‌కు సమాచారం అందింది. దాని ఆధారంగా సోమవారం డీన్ తేరినిరాజన్ వైద్య విద్యార్థుల గదుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ట్రైనీ డాక్టర్లు తరుణ్, జయంత్, సంజయ్ రత్నవేల్ తదితరుల గదిలో 149 గ్రాముల గంజాయి, నొప్పి నివారణకు వైద్యానికి వినియోగించే నాలుగు కెటామైన్ వైల్స్ కనుగొన్నారు. ఈ విషయమై డీన్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ముగ్గురు ట్రైనీ డాక్టర్లను అరెస్ట్ చేసి, తప్పించుకున్న మరొకరి కోసం గాలిస్తున్నారు. కాగా, వీరికి గంజాయి ఎవరిచ్చారనే విషయమై విచారించేందకుఉ కొట్టూరుపురం సీఐ నేతృత్వంలో ప్రత్యేక బృందం ఏర్పాటైంది.

తమిళ చిత్రజ్యోతి

ఉత్తర చెన్నైలో మూతబడ్డ
మరో థియేటర్

చెన్నై మహానగరంలో ఉన్న పురాతన థియేటర్లు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. తాజాగా ఉత్తర చెన్నైలో మరో థియేటర్ శాశ్వతంగా మూతపడింది. చెన్నై మహానగరానికి దక్షిణాది సినీ పరిశ్రమకు రాజధానిగా గుర్తింపువుంది. అనేక దక్షిణ ప్రాంతీయ భాషా చిత్రాలతో పాటు పలు హిందీ చిత్రాలు ఇక్కడ తెరకెక్కాయి. నాటి నుంచి నేటి వరకు చెన్నై నగర వాసులకు ప్రధాన కాలక్షేపంగా సినిమా మారిపోయింది. ఈ పరిస్థితుల్లో ఒకపుడు ఓ వెలుగు వెలిగిన పలు థియేటర్లు ఇపుడు వరుసగా మూతపడుతున్నాయి. వీటిలో 40 నుంచి 50 యేళ్ళకుపైగా ఎన్నో హిట్ చిత్రాలు ప్రదర్శించిన థియేటర్లున్నాయి. ఇటీవల మైలాపూర్‌లోని కామధేను థియేటర్, అశోక్ నగర్‌లోని ఉదయం సినీ కాంప్లెక్స్ మూసివేశారు. ఇపుడు ఉత్తర చెన్నైలోని రెండు ప్రధాన థియేటర్లు మూతపడ్డాయి. వీటిలో ఒకటి తండయారుపేటలోని ఎంఎం థియేటర్‌ను కొన్ని నెలల క్రితం మూసివేశారు. ఇపుడు పెరంబూరులోని బృందా థియేటర్. ఇది ఆ ప్రాంత సినీ ప్రేక్షకులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ముఖ్యంగా సూపర్‌స్టార్ రజనీకాంత్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగిన బృందా థియేటర్ మూతపడటం అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. రజనీకాంత్ నటించిన ప్రతి చిత్రం ఇక్కడ ప్రదర్శించేవారు. బృందా థియేటర్ సుమారు 15 గ్రౌండ్ల విస్తీర్ణంలో ఉంది. మొత్తం 1370 సీటింగ్ కెపాసిటీ ఉన్న ఈ థియేటర్‌లో 1985లో తొలిసారి మోహన్ నటించిన 'ఉదయగీతం' తొలి ఆటగాను, ఆ తర్వాత రజనీకాంత్ నటించిన 'నాన్ సిగప్పు మణిదన్' మిగిలిన మూడు ఆటలుగా ప్రదర్శించారు. ఈ థియేటర్‌లో రజనీకాంత్ నటించిన 'మాప్పిళ్లై' అత్యధికంగా 224 రోజులపాటు ప్రదర్శించారు. ఈ రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. ఇక్కడ చివరగా 'డ్రాగన్' ప్రదర్శించారు. ఈ నెల 9వ తేదీతో 40 యేళ్ళు పూర్తి చేసుకున్న ఈ థియేటర్ ఇకపై శాశ్వతంగా కనుమరుగుకానుంది.


బృందా థియేటర్

రజనీ థియేటర్‌గా గుర్తింపు...

ఈ థియేటర్‌కు బృందా అని పేరు పెట్టినప్పటికీ... స్థానికంగా మాత్రం రజనీ థియేటర్ అని పిలుచుకునేవారు. రజనీకాంత్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగడంతో అలా పిలిచేవారని థియేటర్ మేనేజర్ పన్నీర్‌సెల్వం చెప్పారు. గత 40 యేళ్ళుగా ఉత్తర చెన్నై వాసులకు వినోదాన్ని పంచిందన్నారు.



ఈ యేడాది బాగా కలిసొస్తుంది

● మాళవికా మోహనన్

ఈ యేడాది తనకు బాగా కలిసివస్తుందని మలయాళ బ్యూటీ మాళవికా మోహనన్ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. తమిళంలో పలువురు అగ్రహీరోల సరసన నటించినప్పటికీ ఆమెకు సరైన బ్రేక్ లభించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె తన అభిమానులతో చిట్ చాట్ నిర్వహించారు. ఇందులో ఆమె మాట్లాడుతూ, 'తమిళ చిత్రాల్లో తనకు '96' సినిమా బాగా నచ్చిందన్నారు. వైల్డ్ ఫొటోగ్రఫీ చేయడం అమితమైన ఇష్టం. దట్టమైన అడవిలో ఉండేందుకు ఇష్టపడతాను. నాకు నచ్చిన క్రికెటర్ విరాట్ కోహ్లి. ఇపుడు తమిళంలో 'సర్దార్-2' లో నటిస్తున్నాను. మలయాళంలో ఒక సినిమా, తెలుగులో ప్రభాస్‌తో కలిసి 'రాజాసాబ్' మూవీలో నటించాను. అందుకే 2025 సంవత్సరం నాకు ఒక వండర్‌ఫుల్ ఇయర్‌గా మిగిలిపోతుంది. ప్రభాస్ మంచి ఆహారప్రియుడని, అతడితో కలిసి ఉండటం ఎంతో ఇష్టం' అని పేర్కొన్నారు.

హీరోయిన్ రూప అంకితభావం
ప్రశంసనీయం

● గీతా కైలాసం

'యమఘాతకి' చిత్ర హీరోయిన్ రూప అంకిత భావం ప్రశంసనీయమని ప్రముఖ నటి గీతా కైలాసం అన్నారు. పెపిన్ జార్జ్ జయశీలన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యమఘాతకి' ఈ నెల 7వ తేదీ విడుదలై విజయం సాధించింది. దీంతో చిత్ర బృందం సక్సెస్ వేడుకలను నగరంలో నిర్వహించింది. ఇందులో రూప, నరేంద్ర ప్రసాద్, గీతా కైలాసం, రాజు రాజప్పన్, సుభాష్ రామస్వామి, హరిత తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాసరావు జలగం నిర్మాణ సారధ్యంలో గణపతి రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమాకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. సక్సెస్ వేడుకలో గీతా కైలాసం మాట్లాడుతూ, 'సినిమాలో నాకంటూ ఓ స్థానం ఉంది. ఈ సినిమా కోసం 45 మంది ఓ పల్లె టూరులో కలిసిమెలిసి ఎంతో అన్యోన్యంగా ఒక కుటుంబంలా ఉన్నాం. ఆ ఊరి ప్రజలంతా మిత్రుల య్యారు. చిత్ర కథానాయిక రూప 35 రోజుల పాటు శవంగా నటించారు. ఈ పాత్ర కోసం ఆమె పడిన శ్రమ, ఆమె అంకితభావం ప్రశంసనీయం. ఈ మూవీని నా సొంత సినిమాగా భావిస్తున్నాను. విడుదలకు ముందే సినిమాను చూసిన సినీ ప్రముఖులు, విడుదలైన తర్వాత ప్రేక్షకులు ఎంతగానో ఆదరించి హిట్ చేశారు. ఇది దర్శకుడి తొలి చిత్రం కాదు. ఎంతో అనుభవమున్న దర్శకుడిగా చేశారు' అన్నారు. ఆ తర్వాత మిగిలిన చిత్రబృందం అంతా ప్రసంగించారు.


'యమఘాతకి' సక్సెస్ మీట్ దృశ్యం

'సర్దార్-2' డబ్బింగ్ షురూ

ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై మిత్రన్ ఆర్.జవహర్ దర్శకత్వంలో కార్తి హీరోగా నటిస్తున్న 'సర్దార్-2' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని డబ్బింగ్ పనులను ప్రారంభించింది. ఈ సినిమా తొలిభాగం ఘన విజయం సాధించడంతో రెండో భాగాన్ని తెరకెక్కిస్తున్నారు. చెన్నై, మైసూర్‌తో పలు విదేశాల్లో చిత్రీకరించారు. ఇందులో కార్తితో పాటు ఎస్‌జే సూర్య, రజీషా విజయన్, ఆషికా రంగనాథ్, మాళవికా మోహనన్ తదితరులు నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా డబ్బింగ్ తాజాగా ప్రారంభించగా, హీరో కార్తి తన పాత్రకు డబ్బింగ్ చెప్పారు. ఆ తర్వాత ఈ సినిమాలో నటించిన ఇతర నటీనటులు తమతమ పాత్రలకు డబ్బింగ్ చెపుతున్నారు. డబ్బింగ్‌తో పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను పూర్తి చేసి సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్ చేయాలని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు.


డబ్బింగ్ స్టూడియోలో కార్తి

వైభవంగా బ్రహ్మపురీశ్వరాలయ మహాకుంభాభిషేకం

ప్యారీస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):ఆలయాల నగరంగా ప్రసిద్ధిచెందిన తంజావూరులోని త్రిపుర సుందరి సమేత బ్రహ్మపురీశ్వరాలయ మహాకుంభాభిషేకం బుధవారం ఉదయం కోలాహలంగా జరిగింది. తంజావూరు మనోజియప్పవీధిలో హిందూ దేవాదాయ శాఖ నిర్వహణలోవున్న బ్రహ్మపురీశ్వరాలయానికి జీర్ణోద్ధారణ పనులు పూర్తిచేసిన అధికారులు, మహాకుంభాభిషేకానికి సంబంధించి ఆదివారం ఉదయం విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభించారు.ఆలయప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో బుధవారం నాలుగుజాముల పూజానంతరం పవిత్ర జల కలశాలను వేదమంత్రోచ్చారణ, మేళతాళాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రధాన గోపుర కలశాలపై శివాచార్యులు పవిత్ర జలాలు సంప్రోక్షించి, కుంభాభిషేకాన్ని పూర్తి చేశారు. వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా భక్తులు తడుస్తూనే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


గోపుర కలశాలకు కుంభాభిషేకం నిర్వహిస్తున్న శివాచార్యులు

సిమ్స్ ఆస్పత్రిలో మహిళలకు ప్రత్యేక చికిత్సా కేంద్రం


చికిత్సా కేంద్రం ప్రారంభోత్సవంలో నటి ఊర్వశి, ఆ కేంద్రం వైద్యులు, సిబ్బంది

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలో సిమ్స్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో బుధవారం మహిళల కోసం ప్రత్యేకంగా 'పెణ్‌మై' పేరుతో చికిత్సా కేంద్రం ఏర్పాటైంది. ఈ కేంద్రాన్ని ప్రముఖ సినీ నటి ఊర్వశి, ఆమె కుమార్తె తేజాలక్ష్మి జీయస్ ప్రారంభించారు. మహిళల రుతు స్రావ సమస్యలు, గర్భధారణ సందర్భంగా ఎదురయ్యే సమస్యలకు సంబంధించి ప్రత్యేక చికిత్సా కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని నటి ఊర్వశి అన్నారు. అదే విధంగా, మహిళలకు సంతాన సాఫల్య చికిత్సకు కూడా ఈ కేంద్రంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం బాగుందని, బాలింతలకు, శిశువులకు కూడా ప్రత్యేక వైద్యనిపుణులతో చికిత్సలందించే విభాగం కూడా ఒకే చోట ఉండటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిమ్స్ ఆస్పత్రి ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజు శివసామి, డాక్టర్ సంధ్యా వాసన్, డాక్టర్ ఎరికా పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 15 వినతులు

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అరుణ్, ప్రజలు, పోలీసుల సమస్యలు తెలుసుకొనేందుకు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ గ్రీవెన్స్‌లో కమిషనర్ సమయంగా పాల్గొని వినతిపత్రాలు స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, బుధవారం జరిగిన గ్రీవెన్స్‌లో కమిషనర్ ప్రజల నుంచి 15 వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమస్యలు విచారించి పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను ఆదేశించారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అరుణ్

'మహిళలకు అన్నగా....'
సీఎం స్టాలిన్‌ను కొనియాడిన మంత్రి రామచంద్రన్

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 'మహిళలకు అన్నగా ఉంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ సహాయం చేస్తున్నారని మంత్రి సాత్తూర్ రామచంద్రన్ కొనియాడారు. విరుదునగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమం, మహిళ హక్కుల శాఖ ఆధ్వర్యంలో మహిళలకు వివాహ నిధి సహాయాల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో 130 మహిళలకు రూ.79.12 లక్షల విలువైన బంగారు నాణేలు, రూ.53.75 లక్షల వివాహ ఆర్థిక సహాయాన్ని మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఇక్కడున్న ప్రతి కుటుంబానికి అన్నగా ఉంటూ బంగారు నాణేలు అందజేసింది ముఖ్యమంత్రి స్టాలిన్ అని,ఆయన అందజేసిన నాణేలను తాను మీకు ఇస్తున్నట్లు తెలిపారు.మహిళల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు అందజేస్తున్న సీఎం స్టాలిన్ అన్నారు. మహిళలు అభివృద్ధి చెందాలని, సమాజంలో ఉన్నత స్థితికి రావాలని కోరుకునే పార్టీ డీఎంకే అన్నారు. ఇళ్లలోనే ఉంటూ పనిచేసుకుంటున్న మహిళలకు ప్రోత్సాహక నిధి అందజేస్తున్నది ముఖ్యమంత్రి స్టాలిన్ అని, పాఠశాలలో పిల్లలకు అల్పాహారం అందజేస్తుండడంతో వారి తల్లుల పనిభారం తగ్గిందని, అలాంటి ప్రభుత్వాన్ని మీరు ఆదరిస్తే మరిన్ని పథకాలు అందజేస్తామని మంత్రి తెలిపారు.


మహిళలకు వివాహ సహాయ నిధి అందజేస్తున్న మంత్రి సాత్తూర్ రామచంద్రన్

మహిళా సంఘాల ఉత్పత్తులకు
ఉచిత రవాణా

● ప్రభుత్వ బస్సుల్లో 25 కేజీల దాకా లగేజీ ఫ్రీ

● అమల్లోకి సీఎం స్టాలిన్ ఉత్తర్వులు

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను 25 కేజీల వరకు ప్రభుత్వ బస్సులో ఉచితంగా తీసుకెళ్లేలనే ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాలు మంగళవారం నుంచి అమలులోకి వచ్చాయి. గుర్తింపు కార్డు కలిగిన మహిళా సంఘాల సభ్యులు తమ సంఘాల్లో చేసిన వస్తువులను 25 కేజీల వరకు లగేజీ టికెట్ లేకుండా వంద కిలోమీటర్ల వరకు తీసుకు వెళ్లొచ్చు. ఏసీ బస్సులు మినహా తక్కిన సిటీ బస్సుల్లోనూ వీరు 25 కేజీల మేర తమ ఉత్పత్తులను ఉచితంగా తీసుకెళ్లవచ్చు. 25 కేజీల లగేజీ తీసుకెళ్లే మహిళా స్వయం సంఘాల సభ్యులకు కండక్టర్లు 'లగేజీ ఫ్రీ' టికెట్ ఇస్తారు. ఆ టికెట్లను మహిళా సంఘాల సభ్యులు తమ గమ్యస్థానం చేరే వరకూ భద్రపరచుకోవాల్సి ఉంటుంది. ఈ లగేజీ ఫ్రీ టికెట్లు తీసుకోకుండా సంఘాల సభ్యులు బస్సులో ప్రయాణిస్తే భారీ జరిమానా విధిస్తారని ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది, ఇక ఈ లగేజీల విషయంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు కొన్ని పరిమితులు కూడా విధించారు. ప్రభుత్వం నిషేధించిన గంజాయి, పొగాకు తదితర వస్తువులు, సులువుగా మండే వస్తువులను గానీ వెంట తీసుకెళ్లకూడదని తెలిపారు. తోటి ప్రయాణికులకు ఇబ్బందులు కలగని రీతిలో లగేజీ తీసుకెళ్లాలని, ప్రభుత్వ రవాణా సంస్థ బస్సుల్లో, సిటీ బస్సుల్లో, ఆర్డినరీ సబర్బన్ బస్సుల్లో మహిళా స్వయం సంఘాల సభ్యులు తమ ఉత్పత్తులు 25 కేజీల దాకా లగేజీ ఫ్రీ టికెట్లతో ఉచితంగా తీసుకెళ్ళొచ్చని తెలిపే ప్రకటన బోర్డులు తప్పకుండా ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వ అధికారులు తెలిపారు. ఇక లగేజీ ఫ్రీ టికెట్లకు (ధర రూ.16 నుండి రూ.45ల వరకు) అయ్యే వ్యయభారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించి ఆ బస్సుల్లో ఇచ్చిన టికెట్ల సంఖ్యను బట్టి రవాణా సంస్థకు చెల్లిస్తుందని అధికారులు పేర్కొన్నారు.


వెదురు బుట్టలు తయారు చేస్తున్న మహిళా స్వయం సహాయ సంఘాల సభ్యులు

రామేశ్వర తీరంలో కోల్‌కాతా నౌకలు

● తిరిగి పంపేందుకు అధికారుల చర్యలు

టి.నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సముద్రతీరంలో గత మూడు రోజులుగా లంగరేసిన కోల్‌కతాకు చెందిన మూడు నౌకలను తిప్పిపంపేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. రామనాథపురం జిల్లా పాంబన్ వద్ద రూ.545 కోట్లతో కొత్త రైలు వంతెనను త్వరలో ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ మూడు నౌకలు పాంబన్ రైలు వంతెన దిగువ గుండా వెళ్లేందుకు వచ్చాయి. అయితే ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఆ రైలు వంతెనదిగువ నౌకలకు దారివ్వడానికి ఇరువైపు రైలు పట్టాలను లిఫ్ట్‌ల ద్వారా పైకెత్తేందుకు వీలులేదని అధికారులు ఆ నౌకల సిబ్బందికి తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం భారత నావికాదళం అధికారులు, రాష్ట్ర సముద్రతీర భద్రతా దళం అధికారులు ఆ మూడు నౌకల్లో తనిఖీ చేశారు. ఆ తరువాత ఆ నౌకలను అక్కడి నుండి మరోచోటుకు తరలించాలని ఆదేశాలిచ్చారు. అదే సమయంలో ప్రస్తుతం రామేశ్వరం సముద్రతీరంలో పెనుగాలులు వీస్తూ, అలల తాకిడి అధికంగా ఉండటంతో వాతావరణం అనుకూలంగా మారిన వెంటనే నౌకలను కో ల్‌కతాకు తరలిస్తామని ఆ నౌకల నిర్వాహకులు తెలిపారు.


రామేశ్వరం తీరంలో నిలిచి ఉన్న కోల్‌కతా నౌక

కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎంతో మంత్రి పొన్ముడి భేటీ


కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను కలుసుకున్న మంత్రి పొన్ముడి, ఎంపీ అబ్దుల్లా

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ వ్యవహారంపై, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను రాష్ట్ర మంత్రి పొన్ముడి బుధవారం స్వయంగా కలుసుకుని చర్చించారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణతో రాష్ట్రానికి కలిగే ఇబ్బందులపై ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో గత వారం అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలతో సమన్వయక కమిటీ ఏర్పాటుచేయాలని తీర్మానించారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణపై నగరంలో ఈ నెల 22న దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అధికార, ప్రతిపక్ష, ప్రాంతీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని డీఎంకే, అధ్యక్షుడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. అందులో భాగంగా బెంగళూరు వెళ్లిన రాష్ట్ర మంత్రి పొన్ముడి, ఎంపీ అబ్దుల్లా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసి సమావేశంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి తదితరులను రాష్ట్ర మంత్రి, ఎంపీలతో కూడిన బృందం కలుసుకుని సమావేశానికి ఆహ్వానించారు.

మెరీనాలో నేత్రపర్వంగా తీర్థవారి

● 20 ఆలయాల ఉత్సవమూర్తులకు విశేషపూజలు

ప్యారీస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 'మాసి మఖం' పర్వదినం సందర్భంగా మెరీనా బీచ్‌లో బుధవారం తీర్థవారి ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. ప్రసిద్ధిచెందిన 20 ఆలయాల ఉత్సవమూర్తులను అలంకరించి వివిధ వాహనాలు, పల్లకీల్లో నగరంలోని పలుప్రాంతాల నుంచి ఊరేగింపుగా మెరీనా తీరానికి తరలించారు. మైలాపూర్‌లో వున్న ఏడు శివాలయాలు, మాధవ పెరుమాళ్ ఆలయం, ట్రిప్లికేన్ పార్థసారథి స్వామి ఆలయం, ఎగ్మూర్ శ్రీనివాస పెరుమాళ్ ఆలయం, తిరువర్కాడు దేవీ కడుమారియమ్మ ఆలయం సహా 20 ఆలయాల్లోని తీర్థకొలను వద్ద ఆలయ అర్చక స్వాములు ఉదయం మహా మఖం సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగిన మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తీర్థవారి మహోత్సవానికి వేల సంఖ్యలో వచ్చిన భక్తులతో మెరీనా తీరం కిటకిటలాడింది. అలాగే బీసెంట్‌నగర్‌లోని అష్టలక్ష్మీ ఆలయం, తిరువాన్మియూర్ మరుందీశ్వరాలయం, అడయార్ అనంతపద్మనాభ ఆలయాల ఉత్సవమూర్తులను కూడా ఊరేగింపుగా ఎలియట్స్ బీచ్ తీరానికి తరలించి తీర్థవారి నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా తిరునల్వేలి గాంధీమతి అమ్మవారి సమేత నెల్లయప్పర్ ఆలయం, చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలోని తల శయన పెరుమాళ్ ఆలయం, తెన్‌కాశీలోని విశ్వనాథ ఆలయం, కడలూరు జిల్లా దేవనాంపట్టినం సముద్రతీరంలో తిరువహిందపురం, పాడలీశ్వర్ సహా సుమారు 24 ఆలయాల ఉత్సవమూర్తులకు భక్తుల దివ్య నామస్మరణ, వేదమంత్రోచ్చారణ, మేళతాళాల మధ్య వైభవంగా తీర్థవారి నిర్వహించారు.


పుణ్యస్నానాలు ఆచరించేందుకు మెరీనా బీచ్‌కు వచ్చిన భక్తులు


పెయింటింగ్ ప్రదర్శన ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

డబ్ల్యూవీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

● ఆకట్టుకున్న పెయింటింగ్ ప్రదర్శన

ప్యారీస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమెన్స్ వాలంటరీ సర్వీస్ ఆఫ్ తమిళనాడు (డబ్ల్యూవీఎస్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. చెట్‌పేట్‌లో వున్న కార్యాలయంలో సంస్థ అధ్యక్షురాలు ప్రొఫెసర్ డాక్టర్ యశోద షణ్ముఖసుందరం అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐవోబీ రిటైర్డ్ జనరల్ మేనేజర్ రేణుకా మోహన్‌రావు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్, చేనేత ప్రదర్శన ప్రారంభించారు. ఈ వేడుకల్లో జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ శాస్త్రవేత్త డాక్టర్ కె.రెమాదేవి, చోళమండలం ఆర్టిస్ట్ జి.లతా గోపాల్ సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించారు. ఇటీవల సీఎం స్టాలిన్ చేతుల మీదుగా అవ్వయార్ అవార్డు కింద అందుకున్న రూ.1,50,300 మొత్తాన్ని యశోద షణ్ముఖసుందరం సంస్థకు విరాళంగా అందించారు. ఉపాధ్యక్షురాలు డాక్టర్ సరోజిని శేషాద్రి, కార్యదర్శి డాక్టర్ మనో భక్తవత్సలం, ఉపకార్యదర్శి ఊర్మిళా వైద్యనాథన్, ట్రెజరర్ కె.శ్రీలక్ష్మీ మోహన్‌రావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నామలై... మీకిది తగునా...!

● త్రిషకు ఒక నీతి... నాకో నీతా...?

● ప్రశ్నించిన నటి విజయలక్ష్మి


విజయలక్ష్మి

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నటి త్రిషను మరో నటుడు మన్సూర్ అలీఖాన్ ఏదో అంటే నానా హంగామా చేసిన బీజేపీ నేతలు.. సీమాన్ తనను వేశ్య అని వ్యాఖ్యానించినా నోరెత్తకపోవడంలో అర్థమేంటో చెప్పాలని నటి విజయలక్ష్మి ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె బుధవారం ఓ వీడియో విడుదల చేశారు. "ప్రస్తుతం నా కేసును ద్రావిడ పార్టీలు, పెరియారిస్టులు పెద్దవి చేస్తున్నాయని, అలాంటి వాటికి సీమాన్ బెదిరిపోవద్దని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తెలిపారు. అయితే సీమాన్‌పై శ్రీలంక తమిళుల కోసం పోరాడినందుకో, కచ్చాదీవి కోసం చేసిన ఉద్యమానికో కేసు నమోదు కాలేదు. శ్రీలంక తమిళులు హత్యలకు గురవుతున్న సమయంలో నాతో నడిపి, నా డబ్బంతా లాక్కొని, లైంగికంగా వేధించి వీధుల పాలు చేశాడు. ఈ విషయమై ఎవరైనా వచ్చి అడిగితే తనకేమీ తెలియదని చెప్పమని బతిమాలాడాడు. డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసులు తగిన రీతిలో ప్రశ్నించడంతో, నాతో సంసారం చేసినట్లు అంగీకరించాడనే వీడియో మీరు చూడలేదా? ప్రపంచమే అసహ్యించుకునేలా 'ఆమె ఒక వేశ్య' అని చెప్పిన సంగతి మీరు తెలియదా? త్రిషపై మన్సూర్ అలీఖాన్ అసభ్యకర వ్యాఖ్యలు చేశారంటూ మొత్తం బీజేపీ రంగంలో దిగి పోరాటం చేసింది కదా! అలాంటి సమయంలో మహిళనైన తనను ఓ వేశ్య అని సీమాన్ వ్యాఖ్యానిస్తే బీజేపీకి చెందిన ఏ ఒక్కరైనా ఖండించారా? ఈ కేసులో సీమాన్‌ను ఓ పెద్ద శక్తి కాపాడుతోందని నాకనిపిస్తోంది. ద్రావిడ పార్టీలు, పెరియారిస్టులు ఓ మహిళ బాధ చూసి పోరాడుతున్నాయని భావిస్తున్నా. మీకు స్నేహితుడైనంత మాత్రాన సీమాన్‌కు మద్దతుగా మాట్లాడితే మిమ్మల్ని ప్రజలు తప్పుగా అనుకోరా? ఈ విషయం కాస్త గుర్తుపెట్టుకోండి అన్నామలైగారూ' అంటూ విజయలక్ష్మి వీడియోలో నిలదీశారు.



అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు బెంగళూరుకు చెందిన మహాలక్ష్మి బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును శ్రీవారి ఆలయం ముందు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీఈవో లోకనాథంకు దాత అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


జస్టిస్ మాల


జస్టిస్ పీబీ భజంత్రీ


నిమ్మగడ్డ రమేష్‌కుమార్


శోభా చంద్రశేఖర్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ మాల, పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీబీ భజంత్రీ శ్రీవారి సేవలో పాల్గొన్నారు. అలాగే, రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్, తమిళ సినీ హీరో విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్ కూడా స్వామిని దర్శించుకున్నారు. వీరందరికీ ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


శ్రీవారి సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.86 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,393

తలనీలాలు సమర్పించినవారు: 19,490



● నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం



కిడ్నీ..శరీరంలో కీలకభూమిక పోషించే అవయవం. రెండు కిడ్నీలు శరీరంలోని వ్యర్థాలను శుభ్రం చేస్తూ మంచి రక్తాన్ని సరఫరా చేస్తాయి. ఈ అవయవాల్లో ఏర్పడు చిన్నపాటి రాళ్లను ఆరంభంలోనే గుర్తించి తొలగించకపోతే తీవ్ర అనారోగ్యం కలగజేస్తాయి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. ఈనేపథ్యంలోనే కిడ్నీవ్యాధిగ్రస్తులైన పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులకు ఆరోగ్య భరోసా ఇస్తోంది.

- తిరుపతి (వైద్యం), ఆంధ్రజ్యోతి


డయాలసిస్ చేసుకుంటున్న కిడ్నీ బాధితులు

- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ అండ
- 1440 మందికి డయాలసిస్ సేవలు
- క్రమం తప్పకుండా నెల వారీ పింఛను

బాధితులకు 'దయా'లసిస్

జిల్లాలో 1440 మంది వరకు కిడ్నీ వ్యాధిబారిన పడి ప్రభుత్వ సాయంతో డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీరికోసం ప్రభుత్వం నెఫ్రోప్లస్ ఆధ్వర్యంలో నాలుగు డయాలసిస్ కేంద్రాలను నిర్వహిస్తోంది. తిరుపతి స్విమ్స్‌లో అతి పెద్ద కేంద్రం పనిచేస్తోంది. నెలలో ఇక్కడ 870 మంది డయాలసిస్ సేవలు పొందుతున్నారు. రుయాలో 119, శ్రీకాళహస్తిలో 40, నగరిలో 25 మందికి డయాలసిస్ చేస్తున్నారు. కొన్ని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనూ ఈ సేవలను అందిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో హయాంలో నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వం కొవిడ్‌ను సాకుగా చూపి కిడ్నీ బాధితులకు 108 వాహనం ద్వారా కల్పించాల్సిన ఉచిత రవాణాకు స్వస్తి పలికింది. నెలకు ఇవ్వాల్సిన రూ.10 వేల పింఛను కూడా అరకొరగానే అందించింది. దూర ప్రాంతాల నుంచి డయాలసిస్ కోసం వచ్చే వారికి ఈ మొత్తం రవాణా ఖర్చులకు కూడా సరిపోయేది కాదు. పింఛను అందక డయాలసిస్ కూడా చేయించుకునేందుకు రవాణా ఖర్చులు లేక కొందరు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. దీనికితోడు డయాలసిస్ కేంద్రాల్లో మందుల కొరత, వైద్య పరికరాల కొరత తీవ్రంగా ఉండేది. ఏడాది కిందట బాధితులు స్విమ్స్ వద్ద దీనిపై ఆందోళనకు కూడా దిగాల్సివచ్చింది..

కూటమి సారథ్యంలో మెరుగైన సేవలు

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యభద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. కిడ్నీ వ్యాధి బాధితులకు పింఛన్లు సక్రమంగా అందడం లేదని గుర్తించింది. ప్రతినెలా నిర్దేశిత సమయానికి అందించేలా చర్యలు తీసుకుంది. ఈ విషయంలో జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. ఫలితంగా ప్రతి నెలా క్రమం తప్పకుండా నిరుపేదలైన బాధితులకు రూ.10 వేల పింఛను అందజేస్తోంది. డయాలసిస్‌కు వచ్చి వెళ్లేందుకు 108 వాహన సదుపాయాన్ని కూడా కల్పించింది.



క్రమం తప్పకుండా ఇస్తున్నారు.

డయాలసిస్ అవసరమైనప్పటి నుంచి ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాను. గడిచిన మూడేళ్లలో డయాలసిస్ కోసం వెళ్లడానికి కూడా డబ్బులుండేవి కావు. కూటమి ప్రభుత్వం వచ్చాక పద్ధతిగా పింఛను ఇస్తున్నారు. ఉద్యోగుల జీతాల కంటే ముందుగానే మాలాంటి వాళ్లకు నెలకు రూ.10వేలు ఇస్తున్నారు.

- మునస్వామి, కేవీఆర్‌పురం

ఏడాది క్రితం ఎన్నికష్టాలో..

ఏడాది కిందట పింఛను కోసం నానా అగచాట్లు పడ్డాను. అధికారుల చుట్టు తిరిగినా నెలలు తరబడి ఇవ్వలేదు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. నాలుగు నెలలుగా క్రమం తప్పకుండా పింఛను అందుతోంది. ఇప్పుడు బాగానే ఉంది.

- వెంకటేష్, వరదయ్యపాళెం





పింఛనే బతుకు మార్గమైంది..

గతంలో పింఛను సక్రమంగా అందక చాలా ఇబ్బందులు పడేదాన్ని. మందులు కొనుక్కోడానికి చేతిలో డబ్బులు లేక నరకం అనుభవించాను. ప్రస్తుతం ఆ సమస్య లేదు. ప్రతి నెలా రూ.10 వేల పింఛను అందుతోంది. ఆ మొత్తం మందులకే కాదు జీవనోపాధికి కూడా తోడ్పడుతోంది

- శకుంతల, మంగళం(తిరుపతి)



- ఆకట్టుకున్న 'విరించి-2కె25' ప్రదర్శనలు
- పద్మావతి వర్సిటీలో వేడుకలు ప్రారంభం

సాంస్కృతికోత్సాహం









తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ బుధవారం సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికైంది. సంగీత సాహిత్య సమలంకృతే.. స్వర రాగ పదయోగ సమ భూషితే.. అంటూ రెండు రోజుల పాటు విరించి-2కె25 పేరిట జరిగే కళావేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజని, కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ హిమబిందు కనోజ్ ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. క్రీడా, సాంస్కృతిక అంశాల ద్వారా సృజనాత్మకత, మానసిక వికాసం ఏర్పడతాయన్నారు. యూనివర్సిటీలో సంగీత, సాహిత్యాల్లో బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అద్వితీయమైన కృషి సాగిందన్నారు. ఇటీవల నోయిడాలోని అమెటి యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచారని గుర్తు చేశారు. అనంతరం నిర్వహించిన వివిధ సంగీత, నృత్య ప్రతిభా పోటీలు ఆకట్టుకున్నాయి. ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మిస్ విరించిగా హీనా సయ్యద్

విరించిలో భాగంగా ఫ్యాషన్ షో నిర్వహించారు. లా డిపార్ట్‌మెంట్‌కు చెందిన హీనా సయ్యద్ మొదటి స్థానంలో నిలిచి మిస్ విరించిగా ఎంపికయ్యారు. ఎల్ఎల్‌బీ విద్యార్థిని నాగభవానీ ద్వితీయ, సీఎస్ఈ విద్యార్థిని ఎస్.మనస్విని మూడవ స్థానంలో నిలిచారు.

ఎస్కేపీడీలో ఉగాది వేడుకలకు అంకురార్పణ

ప్యారీస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ) ఆధ్వర్యంలో విశ్వావసు నామ తెలుగు ఉగాది, శ్రీరామనవమి, వాసంవాంబ జయంతి ఉత్సవాలను ఈ నెల 30వ తేదీ, ఏప్రిల్ 6వ తేదీనుండి మే 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర పంతులు బృందం ఆలయప్రాంగణంలో పూజాకార్యక్రమాలు నిర్వహించి, స్తంభ ప్రతిష్ఠ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కేపీడీ ట్రస్టీలు దేసు లక్ష్మీనారాయణ, ఎస్ఎల్ సుదర్శనం, సీఆర్ కిషోర్‌బాబు, తాతా బద్రినాద్, కార్యదర్శి ఎం.కిషోర్‌కుమార్ సహా ఆలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.


స్తంభ ప్రతిష్ఠ పూజలో ఎస్కేపీడీ ట్రస్టీలు

'తమిళ సాహిత్యంలో ధర్మాలు' సదస్సు విజయవంతం

అడయార్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 'తమిళ సాహిత్యంలో ధర్మాలు' అనే అంశంపై పట్టాభిరాంలోని ధర్మమూర్తి రావు బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కాలేజీలో అంతర్జాతీయ సదస్సు బుధవారం జరిగింది. ఈ కాలేజీ తమిళ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో సుమారు వంద మందికిపైగా పత్ర సమర్పణ చేశారు. ఈ వ్యాసాలను ఐఎస్ఎస్ఎన్ నంబరుతో ముద్రించి ఆవిష్కరించారు. మద్రాస్ డిస్ట్రిక్ లైబ్రరీ కమిషన్ సభ్యుడు, ప్రముఖ కవి మనుష్య పుత్రన్ ప్రత్యేక అతిథిగా హాజరై పుస్తక తొలి ప్రతిని స్వీకరించారు. కళాశాల కార్యదర్శి వెంకటేశ పెరుమాళ్ చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరిగింది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వికరసి, కళాశాల సంచాలకుడు డాక్టర్ ఎస్.రాజేంద్ర నాయుడు, తమిళ శాఖాధ్యక్షురాలు బేబీ ప్రసంగించారు. సభా నిర్వహణ డాక్టర్ ఎం.కస్తూరి చేయగా, డాక్టర్ లక్ష్మి వందన సమర్పణ చేశారు. ఇందులో ఇతర కాలేజీ శాఖలకు చెందిన అధ్యాపకులు డాక్టర్ టి.కల్పన, డాక్టర్ జైనబీ తదితరులు పాల్గొని పత్రసమర్పణ చేశారు.


సదస్సులో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

ఘనంగా కోలత్తమ్మన్ ఆలయ కుంభాభిషేకం

తిరుత్తణి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు నార్త్ యూనియన్ కుమారమంగళం అరుళ్మిగు కోలత్తమ్మన్ ఆలయంలో కుంభాభిషేకం వైభవంగా జరిగింది. పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం డీఎంకే యూనియన్ కార్యదర్శి సీజే.శ్రీనివాసన్, డీఎంకే పట్టణ కార్యదర్శి సీజే.సెంథిల్‌కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో తిరుమలై లోగనాథన్, ఎస్పీ అయ్యప్పన్, కుమారమంగళం శేఖర్, కేశవన్, ఎస్కే ఖలీల్, రిటైర్డ్ టీచర్ మోహన్‌బాబు, మీసాయి వెంకటేశన్, ఏ.హరిబాబు పాల్గొన్నారు.


కుంభాభిషేకంలో నిర్వాహకులు

ఫుట్‌పాత్‌ల శుభ్రం కోసం ప్రత్యేక వాహనాలు

● ప్రారంభించిన జీసీసీ మేయర్ ప్రియ

అడయార్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని ఫుట్‌పాట్‌లు, బస్టాపులను శుభ్రం చేసేందుకు కొత్తగా తీసుకొచ్చిన వాహనాలను నగర మేయర్ ఆర్.ప్రియ బుధవారం ప్రారంభించారు. చెన్నై కార్పొరేషన్ పరిశుభ్రత, పచ్చదనానికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది. ఇందులోభాగంగా, నగరంలోని వంతెనలు, బస్టాపులు, పార్కులు, వంతెనల కింద ఉండే ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులోభాగంగా, ఫుట్‌పాత్‌లు, బస్టాపులను శుభ్రం చేసేందుకు వీలుగా కొందరు సిబ్బందితో 30 వాహనాలను సిద్ధం చేయగా, వీటిని నగర మేయర్ ఆర్.ప్రియ ప్రారంభించారు. చెన్నై నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు వీలుగా నగర పాలక సంస్థ చేపడుతున్న చర్యలకు నగర వాసులు కూడా సహకరించాలని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



భెల్ జీఎం ఆత్మహత్య ?

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపం తిరువెరుంబూరులో ఉన్న బీహెచ్ఈఎల్ జనరల్ మేనేజర్ షణ్ముగం (50) తన కార్యాలయం గదిలో తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగర్‌కోవిల్ ప్రాంతానికి చెందిన షణ్ముగం తిరువెరుంబూరు సమీపంలో భార్య పార్వతి, కుమార్తె వింద్యతో కలిసి నివసిస్తున్నారు. పార్వతి కూడా భెల్ బాయిలర్ సెక్టార్ వద్దనున్న పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. సంధ్య తంజావూరులో బీటెక్ చదువుతోంది. షణ్ముగం మంగళవారం ఉదయం డ్యూటీకి వెళ్ళి సాయంత్రం తిరిగి రాలేదు. దీంతో పార్వతి ఆయన సెల్‌ఫోన్‌కు కాల్ చేసినా అటెండ్ చేయలేదు. ఆమె వెంటనే భర్త కార్యాలయానికి వెళ్లి సిబ్బందిని భర్త గురించి అడిగారు. వెంటనే సిబ్బంది షణ్ముగం గదికి వెళ్ళగా లోపలివైపు గడియ పెట్టి ఉండటం గమనించారు. వెంటనే తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్ళినప్పుడు షణ్ముగం నుదుట బుల్లెట్ గాయంతో రక్తం కారి శవంగా పడి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. మృతదేహం పక్కనే ఓ నాటు తుపాకీ లభించింది. ఆ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసుల అనుమానిస్తున్నారు. షణ్ముగం గుండెనొప్పితో తరచూ బాధపడుతుండేవాడని, ఆ కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కూడా భావిస్తున్నారు.

కోవై సమీపంలో పట్టాలపై సిమెంట్ దిమ్మెలు

● పట్నారైలు కూల్చివేతకు కుట్ర?

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపంలోని సింగానల్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఇరుకూరు - పీలమేడు మధ్య రైలుపట్టాలపై మూడు చోట్ల సిమెంట్ దిమ్మెలు పడి ఉండటం తీవ్ర కలకలం రేపుతోంది. ఆ మార్గంలో వెళ్లే పట్నా రైలును కూల్చివేసేందుకు దుండగులు కుట్రపన్ని ఉంటారని రైల్వే అధికారులు అనుమానిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి కేరళ రాష్ట్రం ఎర్నాకుళం నుంచి బీహార్ రాష్ట్రం పట్నాకు ఎక్స్‌ప్రెస్ వెళ్తుండగా పక్కనే ఉన్న పట్టాలపై మూడు చోట్ల సిమెంట్ దిమ్మెలుండడం లోకో పైలెట్ గమనించి వెంటనే కోయంబత్తూరు రైల్వే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ గిరీష్ నాయకత్వంలో పోలీసులు, రైల్వే భద్రతా విభాగం డీఎస్పీ బాబు ఇతర పోలీసులు, పీలమేడు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. సింగానల్లూరు రైల్వే గేట్‌కీపర్ సహా సిబ్బంది కూడా ఆలోగా అక్కడికి చేరుకున్నారు. అందరూ కలిసి ఆ పట్టాలను పరిశీలించగా ప్రతి మూడు వందల మీటర్ల దూరంలో మూడు చోట్ల పట్టాలపై సిమెంట్ దిమ్మెలు ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే రైల్వే కార్మికులు ఆ సిమెంట్ దిమ్మెలను తొలగించారు. ఆ తర్వాత ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలను గమనించగా, ఇద్దరు వ్యక్తులు సంచరించడాన్ని గమనించారు. ఆ వీడియో ఆధారంగా వారిని గుర్తించటానికి రైల్వే భద్రతాదళం అధికారులు రాత్రంతా తీవ్రంగా ప్రయత్నించారు. చివరకు బుధవారం వేకువజామున ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. వారిలో ఒకడు కోత్తగిరి ప్రాంతానికి చెందినవాడని, ఇంకొకడు అతడి స్నేహితుడని కనుగొన్నారు. ఇరువురూ మద్యం మత్తులో పట్టాలపై సిమెంట్ దిమ్మెలను ఉంచి ఎక్స్‌ప్రెస్‌ను కూల్చేందుకు ప్రయత్నించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఆ ఇరువురినీ రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి తీవ్ర విచారణ జరుపుతున్నారు.

ఘనంగా పంచాయతీ పాఠశాల వార్షికోత్సవం

తిరుత్తణి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కరళంబాక్కం పంచాయతీ సమితి మాధ్యమిక పాఠశాల ఐదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ఎస్ఐ రమేష్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో గత వారం పాఠశాలలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎస్ఐ చేతులమీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబు, ఉపాధ్యాయులు కుమార్, సుకన్య, రామలక్ష్మీ, హేమలత, అనురాధ, గోవిందమ్మ, సుందరి, అనిత, పీటీఏ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈడిగపేట ప్రాథమిక పాఠశాలలో....

తిరువళ్లూరు జిల్లా ఈడిగపేటలోని యూనియన్ ప్రాథమిక పాఠశాల ద్వితీయ వార్షికోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమావతి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.